

ఇళంగో కుమార్తె వివాహ వేడుకలో సీఎం దంపతులు, డిప్యూటీ సీఎం, ఇతర మంత్రులు

మళ్లీ డీఎంకే పాలనే

● ఈసారి 234 స్థానాలూ మావే ● సీఎం స్టాలిన్ ధీమా

చెన్నై, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే సారథ్యంలోని కూటమి 234 సీట్లలో విజయ ఢంకా మోగిస్తుందని ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ జోస్యం చెప్పారు. బుధవారం చెన్నైలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన లోక్‌సభ సభ్యుడు ఎన్ఆర్ ఇళంగో కుమార్తె, మైలాపూర్ ఎమ్మెల్యే టి.వేలు కుమారుడి వివాహ మహోత్సవాలకు సీఎం కుటుంబ సమేతంగా హాజరయ్యారు. టి.వేలు కుమారుడి రిసెప్షన్ తేనాంపేట లోని డీఎంకే ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ.. ఇపుడు మన రాష్ట్రంలో ఇతర రాష్ట్రాలు, దేశానికే కాదు ప్రపంచానికే ఒక రోల్ మోడల్‌గా ఉండేలా పాలన సాగుతోందన్నారు. గత ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామన్నారు. తనకుంటే ముందు ప్రసంగించిన సీనియర్ నేత కన్నప్పన్ వచ్చే ఎన్నికల్లో డీఎంకే కూటమి 200 లేదా 220 స్థానాల్లో గెలుపొందుతుందని వ్యాఖ్యానించారని, నిజం చెప్పాలంటే కన్నప్పన్ పిసినారిలా ఉన్నారని సరదాగా వ్యాఖ్యానించారు. మొత్తం 234 స్థానాల్లో విజయం సాధిస్తామని ఎందుకు చెప్ప లేరని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో డీ ఎంకే కూటమి 234 స్థానాల్లో విజయ ఢంకా మోగించబోతుందన్నారు. దీనికి కారణం తాను వెళ్ళిన ప్రతి చోటా ప్రజలు నాలుగైదు కిలోమీటర్ల మేర బారులు తీరి బ్రహ్మరథం పడుతున్నారని గుర్తు చేశారు. వారి ఉత్సాహం, ఆదరణ చూస్తే ఖచ్చితంగా అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామని తేలిపోయిందన్నారు. ప్రత్యర్థులంతా ఏకమై వచ్చినా, ఒంటరిగా వచ్చినా ఓ పట్టు పడుదాం అంటూ ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో పార్టీ నేతలను, శ్రేణులను భయపెట్టేందుకు ప్రత్యర్థులు ఐటీ, ఈడీ, సీబీఐ ఇలా అన్ని వ్యవస్థలను ప్రయోగించినా భయపడే ప్రసక్తే లేదన్నారు. 2026 ఎన్నికల్లోనూ ద్రావిడ మోడల్ పాలన వస్తుందని, రాష్ట్రంలో ఏడోసారి డీఎంకే ప్రభుత్వం ఏర్పాటవుతుందని సీఎం స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు.

మతతత్వానికి, చెడుకు వ్యతిరేకమే

మతతత్వానికి, చెడుకు తాము వ్యతిరేకమేనని సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం కార్యకర్తలకు బహిరంగ లేఖ రాశారు. దేశభక్తి మనకు ఎన్నికల రాజకీయ నినాదం కాదని, నిజమైన దేశభక్తి అంటే రాష్ట్రాల హక్కులతో కూడిన భారతదేశమన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రజలే యజమానులని, మనం కేవలం వారి సేవకులం మాత్రమేనని పేర్కొన్నారు.మతతత్వానికి, చెడుకు వ్యతిరేకంగా మీలో ఒకడిగా దృఢంగా నిలబడతానన్నారు. డీఎంకే అంటే తమిళనాడు అని ప్రత్యర్థులు చాలా కాలంగా గ్రహిస్తున్నారని, ఇది రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను మాత్రమే కాకుండా, భారత ప్రజాస్వామ్యాన్ని కూడా పరిరక్షించే ఉద్యమమని వ్యాఖ్యానించారు. ప్రజల అఖండ మద్దతుతో డీఎంకే మరోసారి ప్రభుత్వ బాధ్యతలు చేపడుతుందని,కార్యకర్తలు తమ వీరోచిత పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

అక్షయ తృతీయ సందడి

● కిటకిటలాడిన నగల దుకాణాలు

● 20 శాతం పెరిగిన విక్రయాలు



నగల దుకాణాల్లో రద్దీ





టి.నగర్ రంగనాథన్ వీధిలో వినియోగదారులు

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నగల దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. రద్దీ కారణంగా బుధవారం అర్థరాత్రి వరకు నగల దుకాణాల్లో విక్రయాలు జరిగాయి. అదే సమయంలో ఈ ఏడాది అక్షయ తృతీయ సందర్భంగా గత ఏడాది కన్నా 20 శాతం అదనంగా అమ్మకాలు జరిగిందని వ్యాపారులు పేర్కొన్నారు. అక్షయ తృతీయ దినాన బంగారం కొంటే సిరిసంపదలతో తుల తూగుతుందని భక్తుల నమ్మకం. ఇదే రోజున ఇళ్లు, స్థలాల విక్రయాలు కూడా అధికంగా జరుగుతుంటాయి. ఆ ప్రకారం, ఈ ఏడాది అక్షయ తృతీయ ఘడియలు మంగళవారం సాయంత్రం 6.29 గంటలకు ప్రారంభమై బుధవారం మధ్యాహ్నం 2.12 గంటల వరకు కొనసాగాయి. దీంతో, ఉదయం 6 గంటల నుంచే వినియోగదారులు దుకాణాలకు చేరుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చిన్న, పెద్ద దుకాణాలు సుమారు 40వేల వరకు ఉన్నాయి. ఇక, రాజధాని నగరంలో 6వేల నగల దుకాణాలున్నాయి. టి.నగర్, ప్యారీస్ కార్నర్, క్రోంపేట, పురుషవాక్కం, పాడి, అన్నానగర్, తాంబరం తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రముఖ నగల దుకాణాల వద్ద ఉదయం నుంచే వినియోగదారులు బారులు తీరారు. అక్షయ తృతీయను పురస్కరించుకుని దుకాణాల్లో బంగారం, వెండి కొనుగోళ్లపై రాయితీ ప్రకటించడంతో పాటు కొత్త డిజైన్లతో కూడిన ఆభరణాలు విక్రయానికి ఉంచారు.

బంగారం ధర పెరిగినా....

గత ఏడాది అక్షయ తృతీయ సందర్భంగా 25 టన్నుల మేర బంగారం విక్రయాలు జరిగాయి. ఆ ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.14వేల కోట్ల వ్యాపారం జరిగింది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 20 శాతం అదనంగా విక్రయాలు జరిగినట్లు వ్యాపారులు తెలుపుతున్నారు. ఆ ప్రకారం, ఈ ఏడాది అదనంగా 5 టన్నుల బంగారం విక్రయాలు సాగాయి. ధరలు పెరిగినా ప్రజలు తమ తమ ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా బంగారం కొనుగోలు చేశారు. ఇక, దుకాణాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

టీటీడీ ఆలయంలో...

స్థానిక టి.నగర్ వెంకట నారాయణ రోడ్డులో ఉన్న టీటీడీ ఆలయంలో బంగారం, వెండి డాలర్లను భక్తులు కొనుగోలు చేశారు. ఈ డాలర్లలో ఒకవైపు వెంకటేశ్వరస్వామి, మరోవైపు పద్మావతి అమ్మ వారి చిత్రాలున్నాయి. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు 2, 5, 10 గ్రాముల బంగారం డాలర్లు, 5, 10 గ్రాముల వెండి డాలర్లు విక్రయించినట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.



టీటీడీ ఆలయంలో బంగారం, వెండి డాలర్లు కొనుగోలు చేస్తున్న భక్తులు

3న చెన్నైకి జేపీ నడ్డా



బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ నెల 3వ తేది నగరానికి రానున్నారు. రాష్ట్ర పార్టీ నిర్వాహకులతో ఆయన సమావేశం కానున్నారు. అలాగే, బీజేపీ నేతలను ఆయన వ్యక్తిగతంగా కలుసుకుని రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, కూటమి వ్యూహంపై చర్చించనున్నారు. అన్నాడీఎంకే-బీజేపీ కూటమి ఏర్పడిన తర్వాత, కూటమి విస్తరణ, బలోపేతం, సంకీర్ణ పార్టీ కార్యనిర్వాహకుల మధ్య ఐక్యత తదితరాలపై జేపీ నడ్డా పార్టీ నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. తాంబరంలోని ఓ ప్రైవేటు విశ్వవిద్యాలయంలో జరుగనున్న కార్యక్రమంలో పాల్గొననున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నయినార్ నాగేంద్రన్ మంగళవారం ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాతో సమావేశమై, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ నేపథ్యంలో, నగరంలో పర్యటించే జేపీ నడ్డా, కూటమి పార్టీలను సమన్వయం చేసుకుని బలోపేతం చేయడంపై రాష్ట్ర నేతలకు పలు సూచనలు చేయనున్నట్లు సమాచారం. కాగా, జాతీయ అధ్యక్షుడు రాక సందర్భంగా రాష్ట్ర నేతలు నగరంలో ఉండాలని రాష్ట్ర పార్టీ అధిష్ఠానం సూచించింది.

అతివేగం ప్రమాదకరం వాహనాల పైకి ఎక్కొద్దు

● అభిమానులకు విజయ్ విజ్ఞప్తి



చెన్నై, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వాహనాలను అతి వేగంగా నడపవద్దని, కార్లు, బస్సులు వంటి వాహనాల టాప్‌పై ఎక్కి ప్రయాణించొద్దని తన అభిమానులకు, పార్టీ కార్యకర్తలకు సినీ హీరో, టీవీకే అధ్యక్షుడు విజయ్ విజ్ఞప్తి చేశారు. ఇదే విషయంపై ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కోయంబత్తూరు వేదికగా జరిగిన టీవీకే బూత్ ఏజెంట్ల మహానాడుకు హాజరై పార్టీపైనా, తనపైనా ఎంతో ఆదరణ చూపించారన్నారు. తనపై ఇంతటి ప్రేమాభిమానాలు చూపించే మీ కోసం రాష్ట్రంలో నిజమైన ప్రజాస్వామ్య పాలన తీసుకొచ్చేందుకు తనవంతు ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. 2026లో జరిగే ఎన్నికల్లో టీవీకే గెలుపుతో ఇది సాధ్యమవుతుందన్నారు. పార్టీలోని యువకులు కొందరు వాహనాలను అతి వేగంగా నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారని, కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోతూ తనతో పాటు వారి కుటుంబ సభ్యులను దుఃఖ సాగరంలోకి నెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరు వాహనాల టాప్‌పై కూర్చొని, నిలబడి ప్రయాణం చేస్తూ ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారన్నారు. ఇలాంటి సాహసాలు ఎవరూ చేయొద్దని విజయ్ విజ్ఞప్తి చేశారు.

అలాంటి పొత్తుకు అవకాశం లేనట్టే?

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం అన్నాడీఎంకే - బీజేపీ కూటమితో చేతులు కలిపే అవకాశం లేదని విజయ్ తన సన్నిహితులతో చెప్పినట్లు తెలిసింది. అన్నాడీఎంకే - బీజేపీ కూటమితో పొత్తు పెట్టుకునేలా విజయ్‌తో ఆయన సన్నిహితుడైన ఓ ఆడిటర్ చర్చలు జరుపుతున్నట్లు రాజకీయవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీనిపై విజయ్ పార్టీ ముఖ్యనేతలకు, సన్నిహితులకు స్పష్టత ఇచ్చినట్లు సమాచారం.

ఓట్టేరి, విరుగంబాక్కం కాల్వల ప్రక్షాళన

● నిబంధనలు అతిక్రమిస్తే రూ.5 లక్షల అపరాధం

● చెన్నై కార్పొరేషన్ సమావేశంలో తీర్మానం



మేయర్ ప్రియ

అడయార్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జీసీసీ పరిధిలోని ఓట్టేరి నల్లా, విరుగంబాక్కం మురుగు కాల్వలను రూ.95 కోట్లతో ప్రక్షాళన చేయనున్నారు. అలాగే, నగర పాలక సంస్థ పరిధిలోని నిబంధనలు అతిక్రమించి నిర్మించే భవనాలకు రూ.5 లక్షల అపరాధం విధించనున్నారు. ఈ మేరకు బుధవారం జరిగిన చెన్నై కార్పొరేషన్ సమావేశంలో తీర్మానించారు. నగర మేయర్ ఆర్.ప్రియ సారథ్యంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. ఇందులో కౌన్సిల్ సభ్యుల అనుమతితో పలు తీర్మానాలను చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. చెన్నై కార్పొరేషన్ పరిధిలోని కొత్త గా భవన నిర్మాణాలకు విధి విధానాలను రూపొందించగా, వాటికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. భవన నిర్మాణాల సమయంలో చే వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా నిషేధం విధించింది. ఈ నిబంధనలు అతిక్రమిస్తే రూ.5 లక్షల వరకు అపరాధం విధించేలా తీర్మానం చేశారు. వర్షాకాలంలో ఓట్టేరి నల్లా, విరుగంబాక్కం కాల్వల్లో వర్షపునీరు సాఫీగా ప్రవహించేలా ఈ కాల్వల్లో పూడికతీతతో పాటు శుద్ధి చేసేందుకు రూ.95 కోట్లతో పనులు చేపట్టేలా తీర్మానం చేశారు. టి.నగర్‌లో కొత్తగా నిర్మిస్తున్న వంతెనకు టి.నగర్ మాజీ ఎమ్మెల్యే దివంగత జె.అన్బళగన్ పేరు పెట్టాలని, కార్ల్ మార్క్స్ విగ్రహాన్ని నందనంలోని ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేయడంతో పాటు మొత్తం 236 తీర్మానాలను ఈ కౌన్సిల్‌లో చేశారు.

డీఎండీకే ప్రధాన కార్యదర్శిగా ప్రేమలత

● 10 తీర్మానాలకు ఏకగ్రీవ ఆమోదం

ప్యారీస్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): డీఎండీకే ప్రధాన కార్యదర్శిగా ప్రేమలత విజయ్‌కాంత్ మళ్ళీ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆమెకు పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. ధర్మపురి జిల్లా పాల్గాట్ సమీపంలోని బాదంపట్టిలో బుధవారం డీఎండీకే రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం జరిగింది. జ్యోతిప్రజ్వలన అనంతరం ప్రపంచ క్యాథలిక్‌ల మత గురువు పోప్ ఫ్రాన్సిస్ మృతికి, కశ్మీర్ పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి సంతాపం తెలుపుతూ అందరూ మౌనం పాటించి నివాళులర్పించారు. అదేవిధంగా అన్ని జిల్లాల్లో పార్టీ అభివృద్ధి కోసం పనిచేసి మృతిచెందిన నేతలు, కార్యకర్తలకు నివాళులర్పించారు. ఈ సమావేశం పార్టీ ప్రధాన పదవులకు నిర్వాహకులను ఎంపిక చేసి, ప్రేమలతను పార్టీ ప్రధాన కార్యదర్శిగా అధికారికంగా ప్రకటించింది. పార్టీ ప్రిసీడియం ఛైర్మన్‌గా డాక్టర్ ఇళంగోవన్, కోశాధికారిగా ఎల్‌కే సుధీష్, ప్రధాన కార్యాలయ కార్యదర్శిగా మాజీ ఎమ్మెల్యే మోహన్‌రాజ్, ఉప కార్యదర్శులుగా ఎంఆర్ పన్నీర్ సెల్వం, చంద్రన్, సెంథిల్‌కుమార్, సుధా రవి ఎంపికయ్యారు. పార్టీ యువజన విభాగం కార్యదర్శిగా ప్రేమలత కుమారుడు విజయ ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ సర్వసభ్య సమావేశంలో, 2026లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కావడం, ప్రచారశైలి, మహానాడు నిర్వహించడం తదితర అంశాలకు సంబంధించి నిర్వాహకులు పలువురు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సర్వ సభ్య సమావేశంలో మొత్తం 10 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. డీఎండీకే వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కాంత్‌కు 'భారతరత్న' ప్రకటించాలని, ఆయన పేరుతో మణి మండపం నిర్మించాలని, కోయంబేడు నుండి మాధవరం వరకు ఎలా వంద గజాల రోడ్డుకు విజయ్‌కాంత్ పేరు పెట్టాలని ఈ సమావేశం డిమాండ్ చేసింది.

కచ్చాదీవికి శాశ్వత పరిష్కారం: ప్రేమలత డిమాండ్

సమావేశంలో ప్రేమలత మీడియాతో మాట్లాడుతూ... 2026 జనవరి 9న కడలూరు జిల్లాలో డీఎండీకే రాష్ట్రస్థాయి మహానాడు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో విధించిన జీఎస్‌టీ పన్ను తగ్గించి నేత కార్మికుల వేతనాన్ని పెంచేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. శ్రీలంక ఆధీనంలో వున్న కచ్చాదీవిని విడిపించి జాలర్ల సమస్యకు శాస్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. మద్యం అమ్మకాలను తగ్గించాలని, కల్తీసారా, గంజాయి విక్రయాలను పూర్తిగా అదుపు చేయాలని ఆమె రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన నూతన వక్ఫ్ చట్టంతో ముస్లింల ఆస్తులకు ఎలాంటి నష్టం కలుగకుండా కేంద్రప్రభుత్వం వ్యవహరించాలని ప్రేమలత తెలిపారు.



వెండి దండంతో ప్రేమలత విజయ్‌కాంత్

కార్మిక దినోత్సవాన్ని సంతోషంగా జరుపుకుందాం

● మేడే సందర్భంగా నేతల శుభాకాంక్షలు

ప్యారీస్,ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని సంతోషంగా జరుపుకుందామని పలు రాజకీయ పార్టీల నేతలు శ్రామిక వర్గాలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన ప్రకటనలో, సుదీర్ఘ పోరాటాలతో,రోజూ ఎనిమిది గంటలపాటు పని, సరైన వేతనం ఇలా పలు హక్కులు సాధించుకున్న రోజే కార్మికుల దినమన్నారు.డీఎంకే ప్రభుత్వ హాయంలోనే కార్మికుల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. ఇటీవల తమ ప్రభుత్వం వస్త్ర దుకాణాల్లో పనిచేసే కార్మికులు సిబ్బంది గంటల తరబడి నిలచి ఉండగా వారికి బల్లలు సమకూర్చాలని ప్రత్యేక చట్టం తీసుకువచ్చిందన్నారు. గురువారం మేడేను పురస్కరించుకుని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఓ ప్రకటన విడుదల చేశారు. దేశానికి కీర్తి ప్రతిష్ఠలను తీసుకురావడంలో కార్మికులు ప్రధానపాత్ర పోషిస్తున్నారని, శ్రమించి చమటోడ్చే చేతులకు 'సలాం' అంటూ ఈపీఎస్ పేర్కొన్నారు. అదేవిధంగా పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్, మక్కళ్ నీది మయ్యం అధ్యక్షుడు కమల్‌హాసన్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్, న్యూ జస్టిస్ పార్టీ ఏసీ షణ్ముగం సహా పలువురు నేతలు కార్మికలోకానికి శుభాకాంక్షలు తెలిపారు.

కులాలవారీ గణనకు కేంద్రం ఆమోదం

● స్వాగతించిన ఈపీఎస్

చెన్నై, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కులాల వారీ గణనకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదించడంపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి స్వాగతించారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... సుమారు 93 ఏళ్ల అనంతరం జనాభా గణనతో పాటు కులాల వారీ గణన చేపట్టనున్నామనే ప్రకటనను ఆనందంగా స్వాగతిస్తున్నామన్నారు. కులాల వారీ గణన చేపడుతున్నట్లు ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీకి అన్నాడీఎంకు తరపున ఈపీఎస్ కృతజ్ఞతలు తెలిపారు. అన్నాడీఎంకే అధికారంలో ఉన్న సమయంలో కులాల వారీ గణనకు చర్యలు చేపట్టామని, అనంతరం అధికారం చేపట్టిన డీఎంకే, ఆ ప్రక్రియ ముందుకు సాగనివ్వలేదని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రకటనను తాము స్వాగతిస్తున్నట్లు ఈపీఎస్ తెలిపారు. అలాగే, కేంద్ర ప్రభుత్వ ప్రకటనను పీఎంకే అధ్యక్షుడు డా.రాందాస్, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ స్వాగతిస్తున్నట్లు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

రాహుల్ ప్రయత్నానికి లభించిన విజయం: సెల్వపెరుందగై

రాహుల్ గాంధీ ప్రయత్నానికి లభించిన విజయమని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నిరంతర ఒత్తిడి ఫలితంగా, కేంద ప్రభుత్వం జనగణనతో పాటు కుల ఆధారిత జనాభా గణన నిర్వహించేందుకు అంగీకరించిందని సెల్వపెరుందగై తెలిపారు.

సమాచార దృష్టి

5 నుంచి గ్రూప్-4 ఇంటర్వ్యూలు

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌పీఎస్సీ 2024వ సంవత్సరం గ్రూప్-4 పోస్టుల భర్తీకి మూడు విడతలుగా ఇంటర్వ్యూ నిర్వహించి పలు పోస్టులు భర్తీ చేసింది. మిగిలిన పోస్టుల భర్తీకి ఐదవ విడత కౌన్సెలింగ్ స్థానిక బ్రాడ్‌వే సమీపంలోని టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో ఈ నెల 5వ తేది జరుగనుంది. ఈ ఇంటర్వ్యూకు ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితా టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. అలాగే, ఎంపిక చేసిన అభ్యర్థులకు ఈ-మెయిల్, ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం అందించామని, ఇంటర్వ్యూకు హాజరుకాని అభ్యర్థులకు మరో అవకాశం కల్పించమని టీఎన్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది.

సెమ్మొళి పార్క్‌లో కూరగాయలు, పండ్లు విక్రయాలు

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెమ్మొళి పార్క్‌లో 'నమ్మ చెన్నై నమ్మ సంధై' పేరుతో గత ఏడాది జనవరి 12వ తేది నుంచి కూరగాయలు, పండ్లు, ఆకు కూరలు విక్రయిస్తున్నారు. ఈ విక్రయ కేంద్రంలో రసాయనాలు వినియోగించని ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ప్రతిరోజు 450 నుంచి 500 మంది ఈ దుకాణంలో కొనుగోలు చేస్తున్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కేంద్రం పనిచేస్తుందని, ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సచివాలయం ప్రకటనలో తెలిపింది.

బీచ్-వేళచ్చేరి మధ్య అదనంగా 20 రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నై బీచ్-వేళచ్చేరి మధ్య అదనంగా మరో 20 ఎమ్మార్టీఎస్ నడపాలని దక్షిణ రైల్వే నిర్ణయించింది. ఈ మార్గంలో ప్రతిరోజు 86 రైళ్లు నడుపుతుండగా, ప్రయాణికుల కోరిక మేరకు ప్రస్తుతం నడుపుతున్న రైళ్ల సంఖ్య 106కు పెంచాలని నిర్ణయించారు. కొత్త ఎమ్మార్టీఎస్ రైళ్లకు సంబంధించిన టైంటేబుల్ త్వరలో విడుదల చేయనున్నట్లు దక్షిణ రైల్వే తెలియజేసింది.

2,134 కొత్త బస్సుల కొనుగోలుకు టెండర్లు

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖ 2,134 కొత్త బస్సుల కొనుగోలుకు టెండర్లు ఆహ్వానించింది. పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులు నడపాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం, మూడువేల కొత్త బస్సుల కొనుగోలుకు గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,535.89 కోట్లు కేటాయించింది. ఇప్పటివరకు కొనుగోలు చేసిన 1,210 బస్సులు ప్రజల అందుబాటులోకి వచ్చాయి. ఈ క్రమంలో ఎంటసీకి 557 బస్సులు సహా 8 జోన్‌లకు మొత్తం 2,134 కొత్త బస్సుల కొనుగోలుకు రవాణా శాఖ టెండర్లు ఆహ్వానించింది. బస్సుల తయారీ సంస్థను త్వరలో ఎంపిక చేసి, ఆరు నెలల వ్యవధిలో కొత్త బస్సులు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. .

టీఎన్ఈబీ ఇంజనీర్ కార్యాలయం చిరునామా మార్పు

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్ఈబీ) చెన్నై నార్త్ విద్యుత్ పంపిణీ సర్కిల్ ఎస్ఈ కార్యాలయం అన్నాసాలైలోని విద్యుత్ బోర్డు ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో ఉంది. ఈ కార్యాలయం ఈ నెల 2వ తేది నుంచి పెరంబూర్ ఐసిఎఫ్ కాలనీ, అంబేడ్కర్ రోడ్డులో ఉన్న సబ్ స్టేషన్ సమీపంలో పనిచేయనుందని టీఎన్ఈబీ ఓ ప్రకటనలో తెలిపింది.

సంగీత పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ కళ, సాంస్కృతి శాఖ ఆధ్వర్యంలో కాంచీపురం సదావరంలో సంగీత పాఠశాల పనిచేస్తోంది. ఈ పాఠశాల రాష్ట్ర సంప్రదాయ కళలు గాత్రం, నాదస్వరం, భరత నాట్యం, వయొలిన్, మృదంగం తదితర కోర్సుల్లో మూడు సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సు అందిస్తోంది. 2025-26వ సంవత్సరానికి ఈ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. 12-25 ఏళ్లలోపుండి 7వ తరగతి ఉత్తీర్ణులైన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. శిక్షణా తరగతులు పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నారు.నాదస్వరం తదితర వాయిద్య కోర్సులు చేసిన వారికి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని దేవాలయాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. మరిన్ని వివరాలకు 9442572948 అనే నెంబరు సంప్రదించవచ్చు.

వేసవి ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం కోయంబత్తూర్-ధన్‌బాద్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, నెం.06063 కోయంబత్తూర్-ధన్‌బాద్ ప్రత్యేక రైలు ఈ నెల 2,9,16,23 తేదీల్లో కోవైలో ఉదయం 11.50 గంటలకు బయల్దేరి మూడవరోజు ఉదయం 8.30 గంటలకు ధన్‌బాద్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06064 ధన్‌బాద్-కోయంబత్తూర్ ప్రత్యేక రైలు ఈ నెల 5,12,19,26 తేదీల్లో ధన్‌బాద్‌లో ఉదయం 6 గంటలకు బయల్దేరి మూడో రోజు వేకువజామున 3.45 గంటలకు కోయంబత్తూర్ చేరుకుంటుంది.ఈరైళ్లు సేలం, జోలార్‌పేట, కాట్పాడి, పెరంబూర్, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ మీదుగా వెళ్లనున్నాయి.

● నెం.07435 కాచిగూడ-నాగర్‌కోయిల్ ప్రత్యేక రైలు ఈనెల 9,16,23,30, జూన్ 6వ తేదీల్లో కాచిగూడ నుంచి రాత్రి 7.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 10.30 గంటలకు నాగర్‌కోయిల్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.07436 నాగర్‌కోయిల్-కాచిగూడ ప్రత్యేక రైలు ఈ నెల 11,18,25, జూన్ 1,8 తేదీల్లో నాగర్‌కోయిల్ నుంచి అర్ధరాత్రి 12.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 6.30 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది.

నేటినుంచి మణిముత్తారు డ్యాం నీటి విడుదల

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా అంబాసముద్రం తాలూకా మణిముత్తారు డ్యాం నుంచి సాగునీరు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు సచివాలయం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... ఈ నెల 1 నుంచి ఆగస్టు 28వ తేది వరకు 120 రోజులు 609.99 మిలియన్ ఘనపుటడుగుల నీరు విడుదల చేయనున్నారు. ఈ నీటితో 2,756.62 ఎకరాలకు సాగు నీరు అందుతుందని ప్రభుత్వం తెలిపింది.

కోల్‌కతాలో అగ్నిప్రమాదం... కరూర్‌కు చెందిన ముగ్గురి మృతి

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఓ స్టార్ హోటల్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో రాష్ట్రానికి చెందిన ముగ్గురు సహా 14 మంది మృత్యువాతపడ్డారు. కరూర్ జిల్లా ఉప్పిడమంగళం సమీపం జ్యోతివడం ప్రాంతానికి చెందిన ప్రభు (40) కలబంద ముడి పదార్థ ఉత్పత్తులు తయారుచేసి విదేశాలకు ఎగుమతి చేస్తుంటాడు. ప్రభుకు మధుమిత అనే భార్య, దియ (10) అనే కుమార్తె, రిధన్ (3) అనే కుమారుడున్నారు. ప్రభు భార్య, పిల్లలు, మామ ముత్తుకృష్ణన్‌లతో కలసి కోల్‌కతాకు విహారయాత్రకు వెళ్లారు. కోల్‌కతా పటా బజార్ రవీంద్ర శారణి ప్రాంతంలోని ఓ హోటల్‌లో బసచేశాడు. మంగళవారం రాత్రి భోజనం తీసుకొచ్చేందుకు ప్రభు- మధుమతి బయటకు వెళ్లారు. ఆ సమయంలో హోటల్‌లో అగ్నిప్రమాదం సంభవించడంతో ఈ విషయాన్ని ముత్తుకృష్ణన్ ఫోన్ ద్వారా ప్రభుకు సమాచారం ఇచ్చాడు. పిల్లలను తీసుకొని వెంటనే హోటల్ పై అంతస్తుకు వెళ్లాలని ఆయన సూచించారు. కానీ, దట్టమైన పొగతో గది నుంచి బయటకు రాలేని దియ, రిధన్ సహా ముత్తుకృష్ణన్ శ్వాసతీసుకోలేక మృతిచెందారు.

సీఎం దిగ్ర్భాంతి...

కోల్‌కతా హోటల్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో రాష్ట్రానికి చెందిన ముగ్గురు మృతిచెందడంపై ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... కోల్‌కతాలో ముగ్గురు రాష్ట్రానికి చెందిన వారు మృతిచెందడం ఆవేదన కలిగించిందని, మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం తెలిపారు.



మృతులు ముత్తుకృష్ణన్, దియ, రిధన్ (ఫైల్‌ఫొటో)

దిండుగల్ రైల్వేస్టేషన్‌లో తాటి బెల్లం విక్రయాలు

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ రైల్వేస్టేషన్‌లో తాటి బెల్లం విక్రయాలకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. స్థానిక ఉత్పత్తుల ప్రోత్సహించేలా రైల్వేస్టేషన్లలో విక్రయ కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నారు. ఆ స్టేషన్ పరిధిలోని తయారై, ప్రజలు అధికంగా కొనుగోలు చేసే వస్తువులను ఈ కేంద్రాల్లో విక్రయిస్తుంటారు. ఆ ప్రకారం, ఇప్పటికే దిండుగల్ రైల్వేస్టేషన్‌లో చిన్నాంపట్టి సుంగుడి చీరలు, కాఫీపొడి తదితరాలు విక్రయిస్తున్నారు. తాజాగా ఏరియోడు, కోవిలూరు, చుట్టుగ్రామాల గ్రామాల్లో అధికంగా తాటిబెల్లం తయారుచేస్తున్నారు.జిల్లా రైతుల విజ్ఞప్తి మేరకు త్వరలో దిండుగల్ రైల్వేస్టేషన్‌లో తాటి బెల్లం విక్రయాలు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

తిరువణ్ణామలై ధర్మకర్తల మండలి చైర్మన్ నియామకం రద్దు

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అన్నామలైయార్ ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా జీవానందం నియామకాన్ని హైకోర్టు రద్దు చేసింది. ట్రస్టీల బోర్డు ఏర్పాటు, చైర్మన్ ఎంపికకు సంబంధించిన నిబంధనలు ఉల్లంఘించారంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ కేసు విచారించిన న్యాయమూర్తి భరత్ చక్రవర్తి ట్రస్ట్ చైర్మన్ జీవానందం నియామకం రద్దు చేయాలని ఆదేశించారు.

మద్యం తయారీ సంస్థలకు సమన్లు

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ అవినీతికి సంబంధించిన విచారణకు హాజరుకావాలని మద్యం తయారీ సంస్థలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సమన్లు జారీచేసింది. టాస్మాక్‌లో అవినీతి జరుగుతుందనే ఫిర్యాదుల నేపథ్యంలో, ఈడీ అధికారుల ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.1,000 కోట్లకుపైగా అవినీతి జరిగిందని అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో టాస్మాక్ సంస్థలకు మద్యం సరఫరా చేస్తున్న కోవై నరసింహనాయకన్‌పాళయంలో ఉన్న శివ డిస్టిలరీస్ నిర్వాహకులకు ఇటీవల ఈడీ అధికారులు సమన్లు జారీచేశారు. తాజాగా, ఎంజీఎం, కాల్స్ మద్యం తయారీ సంస్థలకు కూడా ఈడీ సమన్లు జారీచేసింది.

'పింక్ ఆటో'లు పురుషులు నడిపితే స్వాధీనం

● హెచ్చరించిన చెన్నై జిల్లా కలెక్టర్

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పురుషులు 'పింక్ ఆటోలు నడిపితే స్వాధీనం చేసుకుంటామని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ హెచ్చరించారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... రాజధాని నగరంలో మహిళలు, పిల్లల భద్రత దృష్ట్యా జీపీఎస్, క్యూ ఆర్ కోడ్ తదితర వసతులతో కూడిన 'పింక్ ఆటో'లను ప్రభుత్వం పరిచయం చేసిందన్నారు. ఆటో కొనుగోలులో రూ.లక్ష సబ్సిడీ, బ్యాంకుల నుండి రుణం మంజూరుతో మార్చి 8వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ పథకం ప్రారంభించారు. తమిళనాడు మోటారు వాహన చట్టం ప్రకారం, పింక్ ఆటోలు మహిళలే నడపాల్సి ఉందన్నారు. కానీ, నగరంలో అధిక శాతం పింక్ ఆటోలు పురుషులు నడుపుతున్నారని ఫిర్యాదులందాయని తెలిపారు. ఈ విషయమై సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి, పింక్ ఆటోలు పురుషులు నడిపితే, వాటిని స్వాధీనం చేసుకుంటారని కలెక్టర్ తెలిపారు.

విద్యార్థిని పట్ల టీచర్ అసభ్య ప్రవర్తన

అడయార్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక విరుగంబాక్కంలో ప్రభుత్వ పాఠశాలలో 13 యేళ్ళ బాలిక పట్ల ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసుల విచారణకు భయపడిన ఉపాధ్యాయుడు కింద పడి అపస్మారక స్థితిలోకి జారుకున్నాడు. మదురవాయల్‌కు చెందిన 13 బాలిక పట్ల తరగతి గదిలో సైన్స్ ఉపాధ్యాయుడు అసభ్యంగా వ్యవహరించాడు.. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఉపాధ్యాయుడుని విచారణకు పిలిచేందుకు సిద్ధమయ్యారు. దీంతో భయపడిపోయిన ఉపాధ్యాయుడు కింద పడి అపస్మారకస్థితిలోకి జారుకున్నాడు. ఆ వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

జల్లికట్టు ఎద్దు దాడిలో యువకుడి మృతి

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జల్లికట్టు ఎద్దు దాడితో యువకుడు మృతి చెందిన ఘటన మదురై జిల్లాలో చోటుచేసుకుంది. అలంగానల్లూర్ సమీపం కీళకరైలో బుధవారం జల్లికట్టు పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో వడివాసన్ నుంచి వస్తున్న ఎద్దులను అదుపుచేసేందుకు యువకులు పోటీపడ్డారు. వారిలో అయ్యనార్ (20) అనే యువకుడు ఎద్దు దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. అతడిని హుటాహుటిన అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పార్శిల్ ఇడ్లీకి అదనపు రుసుం

● క్యాటరింగ్ సంస్థకు రూ.30 వేల అపరాధం

అడయార్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పార్శిల్ ఇడ్లీకి అదనపు రుసుం వసూలు చేసిన తిరుచ్చికి చెందిన రైల్వే క్యాటరింగ్ సంస్థకు రూ.30 వేల అపరాధం విధిస్తూ విల్లుపురం జిల్లా వినియోగదారుల ఫోరం ఆదేశించింది. విల్లుపురం జిల్లాకు చెందిన ఆరోగ్య స్వామి అనే వ్యక్తి 2022, మార్చి 23వ తేదీ మదురై నుంచి చెన్నై వచ్చే వైగై ఎక్స్‌ప్రెస్ రైలులో విల్లుపురం వరకు ప్రయాణించారు. ఉదయం 7.30 గంటలకు మదురైలో బయలుదేరిన ఈ రైలు ఉదయం 9.30 గంటలకు తిరుచ్చికి చేరింది. రైల్వే స్టేషన్‌లోని మొదటి ప్లాట్‌ఫాంలో రైల్వే లైసెన్స్ ఉన్న క్యాటరింగ్ సెంటర్‌లో రూ.80కు రెండు సెట్ల ఇడ్లీ, వడ పార్శిల్ కట్టించుకున్నాడు. అయితే, ఆ పార్శిల్‌లో ఎంఆర్‌పీ రూ.26 (ఒక్కో సెట్ ధర) ఉంది. వెంటనే క్యాటరింగ్ సేల్స్ బాయ్‌ను ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో విల్లుపురం వచ్చిన తర్వాత స్టేషన్ మేనేజరుకు, తిరుచ్చి డివిజన్ మేనేజరుకు ఫిర్యాదు చేయగా, వారు విచారణ జరిపి, క్యాటరింగ్ కంపెనీ నుంచి రూ.వెయ్యి అపరాధం వసూలు చేసి ఇచ్చారు. అయితే, తనకు రావాల్సిన రూ.8 మాత్రం ఇవ్వలేదు. దీంతో ఆరోగ్యస్వామి ఆ క్యాటరింగ్ సెంటరుపై విల్లుపురం జిల్లా వినియోగదారుల ఫోరం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై పలు దఫాలుగా విచారణ జరిపిన కోర్టు.. క్యాటరింగ్ కంపెనీకి రూ.30 వేలు అపరాధం విధిస్తూ తాజాగా తీర్పునిచ్చారు.

ప్రజా గ్రీవెన్స్‌లో 19 వినతులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పోలీసు కమిషనర్ అరుణ్

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు. పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అరుణ్, ప్రజలు, పోలీసుల సమస్యలు తెలుసుకొనేలా ప్రతి మంగళవారం, బుధవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో, బుధవారం జరిగిన గ్రీవెన్స్‌లో కమిషనర్ అరుణ్ ప్రజల నుంచి 19 వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సమస్యలు విచారించి పరిష్కారం చూపాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను కమిషనర్ ఆదేశించారు.

రావాల్సిన జీతాలు ఇప్పించండి



పోలీసులతో మాట్లాడుతున్న బాధితులు

తిరుత్తణి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూందమల్లిలోని ఓ ప్రైవేటు విద్యుత్ పరికరాల కంపెనీ తమకు జీతాలివ్వడం లేదని, ఆ కంపెనీ బస్సును అడ్డుకుని కార్మికులు నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళ్తే చెన్నై నగరంలోని పూందమల్లిలో విద్యుత్ పరికరాలు తయారీ కేంద్రంలో తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు సమీపంలోని పళాయనూర్ గ్రామానికి చెందిన 23 మంది పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత రెండు నెలలుగా వీరికి జీతాలు ఇవ్వలేదు. దీనిపై సంబంధిత కంపెనీకి ఫిర్యాదు చేసినా స్పందించలేదని సమాచారం. దీంతో మంగళవారం వారు పనిచేసే కంపెనీ బస్సును అడ్డుకుని నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని కార్మికులతో మాట్లాడగా, మాకు జీతాలు ఇప్పించండి అంటూ బాధితులు పోలీసులతో వాపోయారు. కంపెనీ అధికారులతో మాట్లాడి మీ సమస్యను పరిష్కరిస్తామన్న పోలీసుల హామీతో వారు నిరసన విరమించి అక్కడి నుండి వెళ్ళిపోయారు.

తిరుత్తణిలో 80 శాతం పూర్తయిన అభివృద్ధి పనులు



తిరుత్తణి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో ఆరె నెలల క్రితం ఎమ్మెల్యే చంద్రన్ ఆధ్వర్యంలో ప్రారంభించిన నగర అభివృద్ధి పనులు 80 శాతం పూర్తయ్యాయి. మురుగన్ ఆలయంలో ఉత్సవాల సమయంలో వేలాదిగా భక్తులు వస్తుంటారు. దీంతో కొండ కింద, నగర ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. దీనిపై గత ఏడాదిలో ప్రజలు ఎమ్మెల్యే చంద్రన్‌కు విజ్ఞప్తి చేయగా, ప్రభుత్వ అనుమతులతో సుమారు 52 కోట్ల నిధులతో తిరుత్తణి ప్రాంతంలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. త్వరలో పనులు కూడా పూర్తికాబోతున్నాయని తిరుత్తణి డివిజనల్ అసిస్టెంట్ ఇంజనీర్ రఘురామన్ తెలిపారు.

అక్రమంగా బస చేస్తున్న విదేశీయులు

● రాష్ట్రం నుంచి బహిష్కరణ ప్రక్రియ ప్రారంభం

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా బసచేస్తున్న విదేశీయులను వారి దేశాలకు పంపించే చర్యలను రాష్ట్ర హోం శాఖ ప్రారంభించింది. పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో దేశవ్యాప్తంగా వీసా కాల పరిమితి ముగిసిన తర్వాత కూడా చట్టవిరుద్ధంగా ఉంటున్న వారిని వారి దేశాలకు పంపించే చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అక్రమంగా ఉంటున్న వారు దేశం విడిచి వెళ్లేందుకు విధించిన గడువు మంగళవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో, వీసా ముగిసి రాష్ట్రంలో అక్రమంగా ఉంటున్న వారి వివరాలను పోలీసు శాఖ సేకరిస్తోంది. ఆ మేరకు, పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులతో హోం శాఖ కార్యదర్శి ధీరజ్‌కుమార్ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీ డేవిడ్‌సన్ ఆశీర్వాదం, క్యూ బ్రాంచ్, యాంటీ టెర్రరిజం విభాగాలకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు. పాకిస్తాన్ మాత్రమే కాకుండా బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక తదితర దేశాల నుంచి వచ్చి వీసా ముగిసిన వారు ఎంత మంది ఉన్నారు? అలాంటి వారిని గుర్తించి ఎలా పంపించాలి అనే విషయాలపై సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

నెల్లయప్పర్ ఆలయంలో అశ్లీల నృత్యాలు

● సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న రీల్స్

చెన్నై, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి నగరం నడిబొడ్డున ఉన్న సుప్రసిద్ధ నెల్లయప్పర్ ఆలయంలో ఓ బాలుడు, బాలిక కలిసి ఓ చిత్రంలోని పాటకు అనుగుణంగా అశ్లీలంగా నృత్యం చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇటీవలి కాలంలో యువతీ యువకులు రీల్స్ తీసి వీడియోలను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియాలో పోస్టు చేయడం ఫ్యాషన్‌గా మారింది. ఇప్పటిదాకా పెద్దలకే పరిమితమైన రీల్స్ వ్యామోహం చిన్నారులకు కూడా వ్యాపించింది. ఆ కోవలోనే నెల్లయప్పర్ ఆలయంలో బాలుడు, బాలిక కలిసి చేసిన నృత్యం చూపరులకు ఏవగింపు కలిగించింది. ఆ ఆలయంలో రోజూ 20 మది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అంతేకాకుండా విశాలమైన ఆ ఆలయం అంతటా సుమారు 100 సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. ఇంతటి పకడ్బందీ ఏర్పాట్లు కలిగి ఉన్న ఆ ఆలయంలో ఈ చిన్నారుల జంట రీల్స్ కోసం నృత్యం చేయడం దేవాదాయశాఖ అధికారులకు దిగ్ర్భాంతి కలిగించింది. దేవాదాయ శాఖ అధికారులు ఉత్తర్వు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆ రీల్స్ తీసిన బాలబాలికలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.



నెల్లయప్పర్ ఆలయంలో డ్యాన్స్ చేస్తున్న బాలబాలికలు

సేలం పోలీసులకు చిన్నారి అప్పగింత

అడయార్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కోయిల్ - బెంగళూరుకు వెళ్ళే డైలీ ఎక్స్‌ప్రెస్‌లో అనాథగా వదిలివేసిన ఎనిమిది నెలల చిన్నారిని సేలం రైల్వే పోలీసులకు అప్పగించారు. ఈ ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం రాత్రి 7.15 గంటలకు మదురై రైల్వే స్టేషన్‌కు వచ్చింది. ఇందులో ఎనిమిది నెలల చిన్నారిని ఇదే రైలులో ప్రయాణించిన చేసిన వీరమణి అనే వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఇచ్చి వెళ్ళిపోయాడు. రైలు మదురై స్టేషన్ నుంచి బయలుదేరి సేలంకు చేరుకుంది. అప్పటికీ ఆ వ్యక్తి రాకపోవడంతో వీరమణి ఆ పసికందును సేలం రైల్వే పోలీసులకు అప్పగించారు. ఆ చిన్నారిని తీసుకొచ్చిన వ్యక్తి కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు.

నకిలీ ఫిర్యాదులు పంపించేవారిపై చర్యలు

● హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు

ప్యారీస్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నకిలీ ఫిర్యాదులు పంపించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా మదురై నగర పోలీస్ కమిషనర్‌కు హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. మదురై జిల్లా మేళూరుకు చెందిన అమలన్ అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌లో వివరాలిలా వున్నాయి. మదురై జిల్లా ఎస్పీపై తాను ఏసీబీకి చేసిన ఫిర్యాదుకు సంబంధించిన విచారణకు హాజరుకావల్సిందిగా తనకు సమన్లు జారీ అయ్యాయని, తాను అలాంటి ఫిర్యాదు చేయలేదని తెలుపుతూ మదురై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనకు జరిగినట్లే సీనియర్ న్యాయవాదుల పేరుతో ఏసీబీ అధికారులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, భారత ప్రధాని, రాష్ట్రపతి తదితర ప్రముఖులకు నకిలీ ఫిర్యాదులు అందించడంపై విచారణ జరుపుతున్న పోలీసు అధికారులు తమ సమయాన్ని వృధా చేసుకుంటున్నారని, అందువల్ల నకిలీ ఫిర్యాదులు పంపేవారిపై చర్యలకు ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్ న్యాయమూర్తి ధన్‌పాల్ ముందుకు బుధవారం విచారణకు రాగా, ప్రభుత్వ తరుపు న్యాయవాది హాజరై వాదించారు. ఇలాంటి ఫిర్యాదులే ప్రభుత్వ న్యాయవాదులకు వ్యతిరేకంగా పంపిస్తున్నట్లు తెలిసిందని, దీనిపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. అనంతరం ఇతరుల పేరుతో నకిలీ ఫిర్యాదులు పంపించే వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సిందిగా హైకోర్టు మదురై బెంచ్ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురికి గాయాలు

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక విల్లివాక్కంలో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. విల్లివాక్కం సిడ్కో నగర్‌కు చెందిన మోహన్ అదే ప్రాంతంలో పాత ఇనుము, పేపర్లు, ప్లాస్టిక్ వస్తువుల దుకాణం నడుపుతున్నాడు. ఈ దుకాణంలో అదే ప్రాంతానికి చెంది న హర్షద్‌మైదీన్ (30) పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి ఆటోలో వినియోగించే 5 కిలోల ఖాళీ గ్యాస్ సిలిండర్‌ను దుకాణంలో విక్రయించాడు. సాయంత్రం హర్షద్ మైదీన్ సిలిండర్‌ను సుత్తితో పగులగొట్టే సమయంలో హఠాత్తుగా అది పేలిపోయింది. ఈ ఘటనలో మైదీన్, మోహన్, ఆ సమయంలో సైకిల్‌పై వెళుతున్న అదే ప్రాంతానికి చెందిన రాజేష్‌కు గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వారిని వెంటనే కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విల్లివాక్కం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జీతం ఇవ్వలేదన్న కోపంతో కారు చోరీ

చెన్నై, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అన్నానగర్‌లో ఓ షోరూమ్‌లో పనిచేస్తున్న అసిస్టెంట్ మేనేజర్ తన జీతాన్ని నిలిపేశారనే ఆగ్రహంతో లగ్జరీ కారు చోరీ చేశాడు. అన్నానగర్‌లో మారుతీ కార్ల షోరూమ్‌లో ఓ కారు నెంబర్ రిజిస్ట్రేషన్‌కోసం ఆర్టీవో ఆఫీసుకు తీసుకెళ్లేందుకు సోమవారం ఉదయం షోరూమ్ బయట పార్కింగ్ చేసి ఉంచారు. మంగళవారం ఉదయం ఆ కారు అదృశ్యమైంది. ఆ కారు కోసం వెదికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో షోరూమ్ మేనేజర్ శంకర్ అన్నానగర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీ పరిశీలించగా మంగళవారం వేకువజాము రెండు గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి హెల్మెట్ ధరించి ఆ కారును నడుపుకుంటూ వెళ్తున్న దృశ్యం కనిపించింది. ఆ వ్యక్తి కారును అక్కడికి దూరంగా జెడ్ బ్లాక్ వద్ద ఉంచి వెళుతుండం కనిపించింది. ఫుటేజీ ఆధారంగా పోలీసులు విచారణ జరపగా, ఆ కారును ఆ షోరూమ్ అసిస్టెంట్ మేనేజర్ రమేష్ అపహరించినట్లు గుర్తించారు.. పెరియార్‌నగర్ ప్రాంతానికి చెందిన రమేష్‌ను మంగళవారం ఉదయం అరెస్టు చేశారు. పోలీసులు విచారణ జరిపినప్పుడు షోరూమ్ మేనేజర్ తనకు రావాల్సిన జీతం రూ.50 వేలను నిలిపి ఉంచడం వల్లే కారును దూరంగా తీసుకువెళ్లి ఉంచానని, ఆ కారుకోసం మేనేజర్ తంటాలు పడతాడనుకునే ఇలా చేశానని వాంగ్మూలం ఇచ్చాడు.

కోవైలో బ్యాంక్‌కు బాంబు బెదిరింపు

పెరంబూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కోవైలోని జాతీయ బ్యాంక్‌కు వచ్చిన బాంబు బెదిరింపు కలకలం రేపింది. సుంగం ప్రాంతంలోని ఐఓబీకి మంగళవారం సాయంత్రం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. వెంటనే బ్యాంక్ మేనేజర్ రేస్‌కోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తెలియజేశారు. బాంబు స్క్వాడ్, పోలీసు జాగిలంతో అక్కడకు చేరుకున్న పోలీసులు, బ్యాంక్‌లో పరిశీలించి, ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. ఈ-మెయిల్ పంపిన చిరునామా కోసం పోలీసులు విచారిస్తున్నారు.

మద్యం మత్తులో నీటమునిగి వ్యక్తి మృతి



హరిబాబు (ఫైల్‌ఫొటో)

తిరుత్తణి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు మండలంలో మద్యం మత్తులో నీటమునిగి ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే తిరువలంగాడు మండలం ఇలుపూరు గ్రామంలోని రిజర్వాయర్ ప్రాంగణానికి రాణిపేట జిల్లా ఉల్లియంబాక్కంకు చెందిన హరిబాబు (25)అనే వ్యక్తి తన మిత్రులతో కలిసి ప్రతిరోజు మద్యం సేవించడానికి వెళ్ళేవారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి సమయంలో స్నేహితులతో కలిసి రిజర్వాయర్‌కు మద్యం సేవించడానికి వెళ్ళిన హరిబాబు మద్యం మత్తులో నీటిలోపడి ఊపిరాడక మృతిచెందాడు. అతడి స్నేహితులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని నీటినుండి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

● వాటర్ ట్యాంక్‌లో పడి చిన్నారి మృతి...

మదురై నర్సరీ పాఠశాల లైసెన్స్ రద్దు

ప్యారీస్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మదురైలోని నర్సరీ పాఠశాల వాటర్ ట్యాంకులోపడి మూడేళ్ళ చిన్నారి మృతిచెందిన సంఘటనలో ఆ పాఠశాల లైసెన్స్ రద్దు చేస్తూ జిల్లా విద్యాశాఖ ప్రిన్సిపల్ అధికారి ఉత్తర్వులు జారీచేశారు. నర్సరీ పాఠశాలలో చదువుతున్న చిన్నారి ఆరుద్ర (3) మంగళవారం ఉదయం పాఠశాల ప్రాంగణంలో స్నేహితులతో ఆడుకుంటూ వాటర్ ట్యాంక్‌లో పడిపోయి, ఊపిరాడక మరణించిన సంఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు నర్సరీ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, నలుగురు ఉపాధ్యాయులను అదుపులోకి తీసుకుని కోర్టు ఉత్తర్వుల మేరకు 15 రోజుల రిమాండ్‌కు తరలించారు. ఈ వ్యవహారంపై స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారులు ఆ పాఠశాలకు సీలు వేశారు. జిల్లా విద్యాశాఖ సీనియర్ అధికారి ఆ పాఠశాల లైసెన్సును రద్దు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

విద్యార్థులు సాంకేతికతతో పోటీపడాలి

కేవీ పాఠశాల చైర్మన్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్



తిరుత్తణి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా ఆర్‌కేపేట మండలం కోరకుప్పం గ్రామంలోని కేవీ పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేవీ పాఠశాల చైర్మెన్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తమిళ టీవీకి చెందిన ఈరోడ్ మహేష్, ప్రిన్సిపాల్ గోమతి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేధింపులకు గురైన బాలికతో వివాహం...

అయినా పోక్సో చట్టం నుంచి తప్పించుకోలేరు : హైకోర్టు

చెన్నై, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులకు గురిచేసిన బాలికను వివాహం చేసుకున్నా, నిందితుడిపై ఉన్న పోక్సో చట్టాన్ని రద్దు చేయలేమని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. కిడ్నాప్ కేసులో ఏడాది జైలు, పోక్సో కేసులో పదేళ్ల జైలుశిక్ష విధించడంపై విజయకుమార్ అనే వ్యక్తి మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. బాలికను వివాహం చేసుకున్న కారణంగా శిక్ష నుంచి విడిపించాలని పిటిషన్‌లో కోరాడు. ఈ కేసు విచారించిన హైకోర్టు... సదరు బాలిక విజయ్‌కుమార్‌తో ప్రేమలో ఉన్నప్పటికీ, అతను బాలికతో లైంగిక సంబంధం పెట్టుకొని, తర్వాత పోక్సో కేసు నుంచి తప్పించుకోవడానికి ఆమెను వివాహం చేసుకున్నాడన్న హైకోర్టు, నిందితుడికి విధించిన శిక్షను సమర్థిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.



ఫెఫ్సీపై సినీ నిర్మాతల సంఘం కేసు

● 7న విచారణ

దక్షిణ భారత సినీ నిర్మాణ కార్మికుల సంఘం ఫెఫ్సీపై తమిళ సినీ నిర్మాతల సంఘం మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీన్ని విచారణకు స్వీకరించిన హైకోర్టు ఈ నెల 7వ తేదీన విచారణ చేపట్టనుంది. నిర్మాతల సంఘ సభ్యులు కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో.. 'ఫెఫ్సీకి వ్యతిరేకంగా కొందరు సాంకేతిక నిపుణులు తమిళనాడు సినీ నిర్మాణ కార్మికుల సంఘం అనే పేరుతో కొత్త సంఘాన్ని స్థాపించారు. దానికి తమిళ సినీ నిర్మాతల సంఘానికి ఎలాంటి సంబంధం లేదు. ముందుగా కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించి తమ సంఘం సభ్యులు నిర్మించే చిత్రాల నిర్మాణాలకు ఫెఫ్సీ ఏమాత్రం సహకరించడం లేదు. ఈ కారణంగా ఏప్రిల్ 8 నుంచి అనేక చిత్రాల నిర్మాణాలు స్తంభించిపోయాయి. కొందరు నిర్మాతలు ఆర్థికంగా నష్టపోతున్నారు. ముందుగా కుదుర్చుకున్న ఒప్పంద మేరకు తమ సంఘం సభ్యులు నిర్మించే చిత్రాలకు ఫెఫ్సీ కార్మికులు సహాయ సహకారాలు అందించేలా ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. దీన్ని విచారణకు స్వీకరించిన హైకోర్టు ఫెఫ్సీలోని 24 అనుబంధ సంఘాలకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 7వ తేదీకి వాయిదా వేసింది.

ఈ క్రెడిట్ అంతా నా భార్యదే

● అజిత్ కుమార్


అజిత్ కుమార్ - షాలిని దంపతులు

తాను ఈ స్థాయిలో ఉండటానికి ప్రధాన కారణం తన భార్య షాలిని అని, అందువల్ల ఈ క్రెడిట్ అంతా ఆమెకే ఇస్తానని హీరో అజిత్ కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'పద్మ భూషణ్' అవార్డు స్వీకరించిన తర్వాత ఆయన ఓ అంగ్ల మీడియాకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. కేంద్రం ఇచ్చిన పద్మ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉంది. ఇంతటి విజయాన్ని సాధించినందుకు ఒక్కోసారి ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఈ స్థాయిలో ఉండటానికి నా భార్య షాలినే కారణం. ఆమె నాకోసం ఎన్నో త్యాగాలు చేసింది. కొన్ని సందర్భాల్లో సరైన నిర్ణయాలు తీసుకోకపోయినా ఆమె నన్ను నిరుత్సాహపరచలేదు. నా కష్ట సమయాల్లో పక్కనే ఉండి భరోసానిచ్చింది. నా జీవితంలో సాధించిన సక్సెస్ క్రెడిట్ అంతా ఆమెకే ఇస్తాను. ఎంతో ప్రజాదరణ పొందిన నటి అయినప్పటికీ నాకోసం అన్నింటికీ దూరంగా ఉంది. 33 యేళ్ళుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నాను. నా వృత్తిని ప్రేమిస్తాను. ఈ జీవితమంతా అభిమానులను ఆలరించడానికే ప్రయత్నిస్తాను. సాధ్యమైనమేరకు సాదాసీదాగా ఉంటాను. ఒకేసారి ఎక్కువగా ప్రాజెక్టులు ఒప్పుకోను. నటనతో పాటు నా ఇతర ఆసక్తులపై కూడా దృష్టిపెడతాను' అని అజిత్ పేర్కొన్నారు.

ఫిజియోథెరపీ కోసం అస్పత్రిలో అజిత్

కోలీవుడ్ అగ్రహీరో, 'పద్మభూషణ్' అజిత్ కుమార్ ఫిజియోథెరపీ కోసం నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో మంగళవారం చేశారు.రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మభూషణ్ పురస్కారాన్ని స్వీకరించిన తర్వాత అజిత్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో మంగళవారం నగరానికి చేరుకున్నారు. ఆ సమయంలో విమానాశ్రయంలో అభిమానుల రద్దీ ఏర్పడింది. ఇందులో అజిత్‌కు స్వల్ప గాయమైందని, ఇందుకోసం ఫిజియోథెరపీ చేయించుకునేందుకు ఆయన థౌజండ్ లైట్‌లోని అపోలో ఆస్పత్రిలో చేరినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం.

ఈశత కొలనులో 'రైజా' అందాల ఆరబోత



చిత్రజ్యోతి

కోలీవుడ్ యంగ్ హీరోయిన్ రైజా విల్సన్ ఎక్స్‌పోజింగ్‌లో తనకెవ్వరూ సాటిలేరని మరోమారు నిరూపించింది. గతంలో పలు సందర్భాల్లో హాట్ ఫొటోలను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన రైజా విల్సన్... ఇపుడు ఈశత కొలనులో అందాలను ఆరబోస్తూ ఓ వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయగా, ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. హరీష్ కళ్యాణ్ నటించిన 'ప్యార్ ప్రేమ కాదల్' అనే చిత్రం ద్వారా వెండితెరకు హీరోయిన్‌గా పరిచయమైన రైజా విల్సన్ ఆ తర్వాత 'ధనుర్ రాశి నేయర్‌గలే', 'ఎఫ్‌ఐఆర్', 'వర్మా', 'పొయ్‌కాల్ గుదిరై', 'కాఫీ విత్ కాదలి' వంటి చిత్రాల్లో నటించి ప్రత్యేకంగా అభిమానులను సంపాదించుకున్నారు. 'ది ఛేజ్' అనే తెలుగు చిత్రంలో నటిస్తున్న రైజా... వేసవి తాపం కోసం స్విమ్మింగ్ పూల్‌లో ఎక్స్‌పోజింగ్ చేస్తూ సేద తీరుతున్నారు'

'కిస్ మీ ఇడియట్' అంటున్న శ్రీలీల


'కిస్ మీ ఇడియట్'లో శ్రీలీల - విరాట్

కన్నడ భాషలో టాలీవుడ్ హీరోయిన్ శ్రీలీల ప్రధాన పాత్రలో నటించగా, 2019లో వచ్చిన 'కిస్' అనే చిత్రాన్ని తమిళంలో 'కిస్ మీ ఇడియట్' అనే పేరుతో రీమేక్ చేస్తున్నారు. నాగన్ పిక్చర్స్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం కన్నడంతో సూపర్‌హిట్ అయి వంద రోజులకు పైగా ప్రదర్శించబడింది. ఇందులో హీరోగా విరాట్ నటించగా, ఇతర పాత్రల్లో రోబో శంకర్, నాంజిల్ విజయన్, అశ్వతి తదితరులు నటిస్తున్నారు. కన్నడంలో దర్శకత్వం వహించిన ఏపీ అర్జున్ తమిళంలోనూ దర్శకత్వం బాధ్యతలు చేపట్టారు. తాజాగా పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఈ మూవీ వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'శ్రీలీల తమిళం, కన్నడం, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించినప్పటికీ తమిళంలో మాత్రం ఆమెకు ఇది తొలిచిత్రం. 'పుష్ప-2'లో శ్రీలీల ఐటమ్ సాంగ్ ఆమె కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. తెలుగులో అల్లు అర్జున్, మహేష్ బాబు, బాలకృష్ణ, రవితేజ, రామ్, నితిన్, కన్నడంతో పునీత్ రాజ్‌కుమార్ వంటి స్టార్ హీరోలతో నటించారు. ప్రస్తుతం శివకార్తికేయన్ సరసన 'పరాశక్తి' పేరుతో తెరకెక్కే తమిళ చిత్రంలో నటిస్తున్నారు. 'కిస్ మీ ఇడియట్ ఒక ఎమోషనల్ లవ్ స్టోరీ, ఆమె కెరీర్‌లో ఒక మంచి మూవీగా నిలిచిపోతుంది' అన్నారు.

బంగారు భవితకు విద్యే పునాది


విద్యా ఉపకార వేతనాలు అందుకున్న వారితో వైవీ హరికృష్ణ, కాశీ విశ్వనాథ్ తదితరులు

● 'గోపురం' సంస్థల అధినేత హరికృష్ణ

ప్యారీస్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బంగారు భవితకు విద్య పునాది వంటిదని గోపురం కుంకుమ సంస్థల అధినేత, అన్నానగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వైవీ హరికృష్ణ పేర్కొన్నారు. నుంగంబాక్కం శివగంగ రోడ్డులోవున్న ఉడ్‌హెడ్ సెంటర్‌లో అన్నానగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెషనల్ కోర్సులు చదువుకుంటున్న 20 మంది విద్యార్థినీ,విద్యార్థులకు విద్యా ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. వైవీ హరికృష్ణ తమ సంఘ నిర్వాహకులతో కలిసి అందజేసి తలా రూ.10వేలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ, తమ సంఘం ఆధ్వర్యంలో పలువురి దాతల సహకారంతో విద్యార్థులను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రొఫెషనల్ కోర్సులు చదువుకుంటున్న విద్యార్థులకు చేయూతనిచ్చేలా తమవంతు సహాయ సహకారాలను ప్రతిఏటా అందించడం సంతోషకరమన్నారు. సంఘ నిర్వాహకుల సమష్టి కృషితో సమాజాభివృద్ధికి కృషిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శులు ఎం.కాశీవిశ్వనాథ్, ఎస్వీ ప్రసాద్ రావు, ట్రెజరర్ ఎ.శ్రీనివాసులు, ముక్కాల భాష్యకారులు, ముక్కాల శ్రీరామ్, వైవీ హరినాథ్, ఎం.నరసింహులు, జి.చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

7న తంజావూరులో రథోత్సవం


ముహూర్తపు రాటకు పూజలు

ప్యారీస్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి చెందిన తంజావూరు బృహదీశ్వరాలయంలో చిత్తిరై రథోత్సవం సందర్భంగా బుధవారం స్తంభ ప్రతిష్ఠ పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. ఈ ఆలయంలో గత నెల 23వ తేదీ ధ్వజారోహణంతో 18 రోజుల చిత్తిరై ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఉత్సవమూర్తులను వివిధ వాహనాల్లో పురవీధుల్లో ఊరేగిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఈ నెల 7న నిర్వహించేందుకు ఆలయ యాజమాన్యం భారీ ఏర్పాట్లలో దిగింది. ఈ సందర్భంగా రథం వద్ద స్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు.

తిరుత్తణి ఆలయంలో కృత్తిక వేడుకలు


మురుగన్‌కు హారతి

తిరుత్తణి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో ప్రసిద్ధి చెందిన మురుగన్ ఆలయంలో చిత్తిరై మాస కృత్తిక సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామునుంచే పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులు శ్రీవళ్ళీ, దేవసేన సమేత మురుగన్ దర్శనం కోసం క్యూలైన్లలో వేచివున్నారు. ఉదయం 5.30 గంటలకు శివాచార్యులు సుగంధద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. అనంతరం బంగారు,వెండి కవచం ధరించి దేవేరులతో భక్తులకు స్వామివారు దర్శనమిచ్చారు. ఉదయం10 గంటలకు వైభవంగా మురుగన్ ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగింది. ఈ క్రమంలో తిరుత్తణి కొండపై రోడ్లపై రద్దీ ఏర్పడి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.


ఆలయానికి పోటెత్తిన భక్తులు

పర్యాటకాన్ని మరింత ప్రోత్సహిస్తాం

● పుదువై మంత్రి లక్ష్మీ నారాయణన్


సమావేశాల ప్రారంభోత్సవంలో మంత్రి లక్ష్మీనారాయణన్, విక్రమ్ కోట

పుదుచ్చేరి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో పర్యాటకాన్ని మరింత ప్రోత్సహిస్తామని, ఇందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణన్ పేర్కొన్నారు. పుదుచ్చేరిలోని ర్యాడిసన్ రిసార్ట్‌లో మంగళవారం గ్రేట్ గ్రీన్ సమావేశాలు ప్రారంభమయ్యాయి.ఈ సమావేశాలను ప్రారంభించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. పర్యాటకంలో దేశంలోనే పుదుచ్చేరిది ప్రత్యేక స్థానమని వివరించారు. టీఆర్‌టీ హోటల్స్ అండ్ రిసార్ట్స్ సీఈవో విక్రమ్ కోట మాట్లాడుతూ.. పుదుచ్చేరి పర్యాటక రంగ కార్యక్రమం జరుపుకోవడం తనకు గర్వకారణంగా వుందన్నారు. అదే సమయంలో పర్యావరణ స్పృహతో కూడిన తన వైఖరిని పునరుద్ఘాటిస్తున్నట్లు వివరించారు. ఈ చొరవ కార్పొరేట్ అతిథులకు కార్బన్ పాదముద్ర ట్రాకింగ్, చెట్ల పెంపకం ఆఫ్‌సెట్‌లు, తగ్గిన ప్లాస్టిక్ వినియోగం, తక్కువ కార్బన్ మెనూలు, ఇతర పర్యావరణ అనుకూల పద్ధతుల ద్వారా పర్యావరణ అనుకూల ఎంఐసీఈ ఈవెంట్‌లను నిర్వహించడానికి అధికారమిస్తుందని వివరించారు.

ఎంటీసీ బస్సు నెంబర్ల మార్పు

చెన్నై,ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) ఏడు మార్గాల్లో నడుపుతున్న బస్సు నెంబర్లు మార్పు చేశారు. ఈ మార్పు గురువారం నుంచి అమలుకు రానుందని ఎంటీసీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం మాధవరం-తాంబరం మధ్య నడుపుతున్న నెం.121ఎఫ్-170ఎగా మార్చారు. అలాగే, కవియరసు కన్నదాసన్ నగర్ నుంచి తాంబరం మధ్య నడుపుతున్న 121 హెచ్-170టి, అయ్యప్పతాంగళ్ నుంచి బ్రాడ్‌వే మధ్య నడుపుతున్న 11జీ ఈఎక్స్-11ఎం, బ్రాడ్‌వే నుంచి కిలాంబాక్కం మధ్య నడుపుతున్న 18ఏఎక్స్-18ఎ, తిరువాన్మియూర్ నుంచి కిలాంబాక్కం మధ్య నడుపుతున్న 91కె-91, పూందమల్లి నుంచి గుడువాంజేరి మధ్య నడుపుతున్న 66ఎక్స్-66పీఎక్స్, కవియరసు కన్నదాసన్ నగర్ నుంచి కిలాంబాక్కం మధ్య నడుపుతున్న 121హెచ్ ఈటీ-170టీఎక్స్‌గా మార్చినట్లు ఎంటీసీ తెలియజేసింది.



స్వాతంత్ర సమరయోధులకు ఘన నివాళి

వేదారణ్యంలో ఉప్పు సత్యాగ్రహ స్మారక దినోత్సవం

ప్యారీస్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నాగపట్నం జిల్లా వేదారణ్యం అగస్త్యం పల్లిలో ఉన్న ఉప్పు సత్యాగ్రహ స్మారక మందిరం ప్రాంగణంలో బుధవారం ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని అశువులు బాసిన స్వాతంత్ర సమరయోధులకు రాష్ట్ర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. తమిళనాడు కాంగ్రె కమిటీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, మాజీ కేంద్ర మంత్రి కేవీ తంగబాలు, ట్రెజరర్ రూబీ మనోహరన్, ఎంపీ సుధా తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సెల్వపెరుందగై నిర్వాహకులను అభినందించారు. అలాగే తిరుచ్చి నుంచి పాదయాత్రగా బయలుదేరి ఇక్కడికి చేరుకున్న బృందం, పార్టీ కార్యకర్తలు, గురుకుల పాఠశాల విద్యార్థులను సన్మానించారు. ఆంగ్లేయుల హయాంలో 90ఏళ్ళ క్రితం వేదారణ్యంలో నిర్వహించిన ఉప్పు సత్యాగ్రహ పోరాటంలో పాల్గొన్న పలువురి ప్రాణత్యాగాన్ని నిత్యం స్మరించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.

మహిళల భద్రతకోసం కొత్త పరికరం

● 24 గంటల పాటు పనిచేసే 'రెడ్‌బటన్ రోబోటిక్ కాప్'


'రెడ్ బటన్ రోబోటిక్ కాప్' పరికరం

టినగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో మహిళలకు పటిష్టమైన భద్రత కల్పించే దిశగా గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో 'రోబో కాప్' సదుపాయం కల్పించారు. నగరంలో కీలకమైన 200 ప్రాంతాల్లో 'రెడ్ బటన్ రోబోటిక్ కాప్' అనే కొత్త భద్రతా పరికరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. 24 గంటలూ పనిచేయగల ఈ పరికరం 360 డిగ్రీల వరకు ఆయా రహదారుల్లో అన్ని ప్రాంతాలను తనిఖీ చేయగలుగుతుంది. ఆ దృశ్యాలను పోలీసు కంట్రోలు రూమ్‌కు పంపిస్తుంది. ఆపదలో ఉన్న యువతులు, మహిళలు, కాలేజీ విద్యార్థినులు ఈ. పరికరంలో ఉన్న రెడ్ బటన్ నొక్కిన వెంటనే పోలీసు కంట్రోల్ రూమ్‌లో అలారం మోగుతుంది. అంతేకాకుండా సమీప ప్రాంతాల్లో గస్తీలో ఉన్న పోలీసులను అప్రమత్తం చేసి ఆ ప్రాంతానికి వెళ్లమని సిగ్నల్ పంపుతుంది. ఈ పరికరం సాయంతో ఆపదలో ఉన్న మహిళలతో పోలీసు కంట్రోల్ రూమ్ నుండే పోలీసులు మాట్లాడగలుగుతారు. అంతే కాకుండా వీడియోకాల్ ద్వారా ఆపదలో ఉన్న మహిళల పరిస్థితి చూడగలుగుతారు. ప్రజలు అధికంగా గుమికూడే బిజినెస్ మాల్స్, ఫ్యాక్టరీలు, ఐటీ సంస్థలు, ఉద్యానవనాలు, రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు, ఆసుపత్రుల వద్ద ఈ పరికరాన్ని అమర్చే ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ తెలిపారు. ఈ పరికరాలను అమర్చిన తర్వాత నగరంలో మహిళలు నిర్భయంగా సంచరించగలుగుతారని చెప్పారు.



ఇటీవల లండన్‌లో జరిగిన పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలకు రాష్ట్ర మంత్రి నాజర్, ఎమ్మెల్యే ఇరుదయరాజ్ హాజరయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకుని పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటాన్ని అందజేస్తున్న ఇరుదయరాజ్.. చిత్రంలో ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రి అన్బిల్ మహేష్, టీఆర్‌బీ రాజా ఉన్నారు.

మధుమేహంపై మరిన్ని పరిశోధనలు

● వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ విశ్వనాథన్

వేలూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా మధుమేహ వ్యాధిని తగ్గించేందుకు మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరముందని వీఐటీ ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ పిలుపునిచ్చారు. వేలూరు జిల్లా కాట్పాడిలోని గాంధీనగర్‌లో ఏర్పాటైన 'డాక్టర్ మోహన్స్' మధుమేహ ఆస్పత్రిని బుధవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత్‌లో సుమారు 25 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నారని, దీనిని నియంత్రించేందుకు అన్ని రకాలుగా సహాయసహకారాలు అందించేందుకు వీఐటీ సిద్ధంగా ఉందన్నారు. గతంలో కోటీశ్వరులకు మాత్రమే ఈ వ్యాధి వచ్చేదని, కానీ ఇప్పుడు అందరికీ సహజమైపోయిందన్నారు. ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ మోహన్ మాట్లాడుతూ.. మధుమేహంపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. మధుమేహ బాధితులు సరైన ఆహారం, వ్యాయామంలో పాల్గొనడంతో పాటు సమయానికి మందులు వేసుకుంటూ, శరీరంలోని అవయవాలు దెబ్బతినకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, వైద్యనిపుణులు డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సితార విద్వాంసులు మిట్టా జనార్ధన్

ఘనంగా అష్టపదుల పుస్తకావిష్కరణ

ప్యారీస్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ సితార విద్వాంసులు మిట్టా జనార్ధన్ నివాసంలో మంగళవారం ఘంటసాల మాస్టర్ జయదేవ అష్టపదులు పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. పుస్తక రచయిత డా.పురుషోత్తమాచార్య, ఘంటసాల గానసభ అధ్యక్షులు డా కేవీ రావు, ప్రముఖ రచయిత సంగీత స్వరకర్త కలగ కృష్ణమోహన్, శ్రీనివాస నరసింగ్ బొందిలి, ప్రముఖ గాయకుడు కిడాంబి లక్ష్మీకాంత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అష్టపది పాటల రికార్డింగ్ అనుభవాలను గుర్తుచేసుకున్న సితార విద్వాంసులు మిట్టా జనార్ధన్ ఘంటసాల భక్తితో ఆలపించిన గీతాలను సౌండ్ ఇంజనీర్ హెచ్‌ఎంప రఘు తనవంతు సహకారం అందించారని ఆయన తెలిపారు. గాయని వినీష, వశిష్ఠ గుజారి తోడిరాగంలో హిందూస్థానీ పాటలు శ్రావ్యంగా ఆలపించారు. ఈ సందర్భంగా మిట్టా జనార్ధన్‌కు నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

ఎలక్ట్రానిక్స్ విభాగాల తయారీకి ప్రత్యేక పథకం

● ప్రారంభించిన సీఎం స్టాలిన్

అడయార్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక ప్రణాళిక రూపొందించింది. దీన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ విషయంపై ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. జాతీయ స్థాయిలో ఎలక్ట్రానిక్స్ పరికరాల ఉత్పత్తి, ఎగుమతుల్లో రాష్ట్రం రెండో స్థానంలో ఉందని ప్రభుత్వం తెలిపింది. ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ ద్వారా లబ్ధి పొందే కంపెనీలను రాష్ట్రానికి ఆకర్షించడానికి వీలుగా రాష్ట్ర పరిశ్రమల, సాంకేతిక మంత్రిత్వశాఖ ఈ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద ప్రకటించిన ప్రోత్సాహంతో పాటు ఎలక్ట్రానిక్స్ రంగంలో విలువ ఆధారిత తయారీ ప్రోత్సహించేలా ఆయా కంపెనీలకు ప్రత్యేక రాయితీలు, ప్రోత్సాహాలను అందించనుంది. ఇందులో భాగంగా రూ.30 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, 60 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం సాధ్యపడుతుందని ఆ ప్రకటనలో పేర్కొంది. ఈ ప్రత్యేక పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యా కార్యక్రమాలపై అవగాహన

చెన్నై, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని 'ఎంఎన్‌కే హెలో డిజిటల్ మల్టీ ట్రేడర్స్' నిర్ణయించింది. ఈ వివరాలను సంస్థ వ్యవస్థాపకులు మనీష్ కుమార్, సహ వ్యవస్థాపకులు సందీప్, డాక్టర్ శ్రీనివాసన్ సెల్వరాజ్, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డాక్టర్ గుగనేంద్రియన్, రాష్ట్ర టెక్నికల్ హెడ్ డాక్టర్ ఎ.పుదియ సెల్వం తదితరులు బుధవారం చెన్నైలో జరిగిన సమావేశంలో వెల్లడించారు. 'ఒన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ' అంశంతో పాటు ఇతర అంశాలపైనా దృష్టి సారించారు. డిజిటల్ విద్యా వ్యవస్థలో అగ్రగామిగా ఎదగడానికి తమిళనాడుకు అపారమైన సామర్థ్యముందన్నారు. డిజిటల్ యుగంలో అభివృద్ధి చెందడానికి అవసరమైన సాధనాలతో ప్రతి విద్యార్థిని శక్తివంతం చేయాలని పిలుపునిచ్చారు.


సమావేశంలో విద్యావేత్తలు



నగర సేద్యం







మడక దున్నుతున్నారు.. మాను తోలుతున్నారు.. అడుసు తొక్కుతున్నారు.. నారు పెరుకుతున్నారు.. నాట్లు వేస్తున్నారు.. ఎండకి చెట్టునీడకి చేరి సేదదీరుతున్నారు.. నడివేసవిలో సాగుతున్న ఈ వరిసేద్యం దృశ్యాలు నీటి వనరులకు లోటులేని ఏ మారుమూల పల్లెల్లోనివో కాదు. లక్షల జనంతో కిక్కిరిసిన తిరుపతి నగరంలోనివి. కాంక్రీట్‌జనారణ్యంలో ఆదివారం మిట్టమధ్యాహ్నపు వేళ 'ఆంధ్రజ్యోతి' కంటబడ్డ శ్రమసౌందర్యం ఇది. అభయమిస్తున్నట్టుగా తిరుమల కొండ.. కొండతో పోటీ పడుతున్నట్టుగా ఆకాశహర్మ్యాలు.. సందడితో నిండిన రెస్టారెంట్లు, రహదారిపై దూసుకుపోయే వాహనాల రణగొణ శబ్దాలు.. వాటి నడుమనే తిమ్మినాయుడుపాళెం మాస్టర్‌ప్లాన్ రోడ్డుకు ఆనుకుని ఇలా వ్యవసాయం సాగుతోంది. విస్తరించుకుని వస్తున్న రియల్‌ఎస్టేట్ వెంచర్ల మధ్యనే ముత్తు, చిరంజీవి, రమణ, మునికృష్ణ అనే నలుగురు రైతులు ఖాళీగా ఉన్న భూమిని కౌలుకు తీసుకుని పంటలు పండిస్తున్నారు. ఎకరా కోట్లు పలికే నేలలో వేల రూపాయలైనా గిట్టుబాటు కాని కష్టం ఎందుకు అని ఈ రైతులు అనుకోలేదు. రోజూ 'మడికాడికి నడిచి, పచ్చని గాలి పీలిస్తే ఉండే ఆనందం వేరే' అంటున్నారు ఈ కర్షకులు. 'రెండు కార్లు పండుతున్నాయి. ఇంటికి కావలసిన గింజలు వస్తున్నాయి. ఇంతకన్నా కావాల్సింది ఏమి?' అని సంతృప్తిని ప్రకటిస్తున్నారు వీరు. పచ్చని పైరు తన హృదయంపై పరచుకుంటేనే నేలతల్లికి శాంతి. కాయకష్టంతో చెమట కారితేనే రైతుకీ మనశ్శాంతి. - తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

"జీవితంలో ఇక సాధ్యం కాకపోవచ్చనే కోరిక, సాకారమైందనే సంతోషం కలుగుతూ ఉంది. ఫిలాసఫీలో పీజీ వల్ల చాలా సంతృప్తిని పొందాను. పీజీ కోర్సులో కొన్ని పుస్తకాలు నన్ను బాగా ఆకట్టుకున్నాయి. జిడ్డు కృష్ణమూర్తి రాసిన 'నీవే ప్రపంచం', ఎస్.రాధాకృష్ణన్ 'ఇండియన్ ఫిలాసఫీ', టీఎంపీ మహదేవన్ రాసిన 'అద్వైత తత్త్వం', ఫ్రాంక్ థిల్లీ రాసిన 'పాశ్చాత్య తత్త్వశాస్త్ర చరిత్ర', ఓషో 'ధ్యానం', 'ప్రేమ' వంటి గ్రంథాలు చదివాను. జిడ్డు కృష్ణమూర్తి తత్వాన్ని చదివినప్పుడు చాలా సంఘర్షణకు లోనయ్యాను. 'దేవుడు అనే నమ్మకంతో సత్యాన్ని తెలుసుకోలేరు' అనడం.. గురుత్వాన్ని తిరస్కరించడం నన్ను బాగా ఆలోచింపజేశాయి."

ఏడు పదుల విద్యార్థి

ఎస్వీయూలో ఎంఏ ఫిలాసఫీ చదువుతున్న రాజేంద్రబాబు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

'అప్పట్లో ఫలానా డిగ్రీ చేయాలనుకున్నాను.. పరిస్థితుల వల్ల ఆపేయాల్సి వచ్చింది.' అని విచార జ్ఞాపకాలను మనుమలతో పంచుకుంటూ ఉంటారు చాలా మంది. 'నా కోరిక తీరనే లేదు.. మీరైనా చదువుకోండి' అని సలహా కూడా ఇస్తుంటారు. ఈయన మాత్రం ఆ బాపతు కాదు. రిటైరయ్యాక కృష్ణా..రామా అనుకుంటూ గడిపేయాలని అనుకోలేదు. నలభై ఏళ్ల కిందట నిలిచిపోయిన పీజీ చదువును ఏడు పదుల వయసులో కొనసాగిస్తున్నారు. అదీ ప్రయివేటుగా కాదు రెగ్యులర్ విద్యార్థిగా.

ఎస్వీ యూనివర్శిటీ ప్రాంగణంలో సైకిలు మీద దూసుకుపోతూ కనిపించే ఈయనను.. 'వ్యాయామం కోసం సైకిల్ తొక్కుతున్న పెద్దాయన' అనుకుంటారు చాలామంది.

లైబ్రరీలో పుస్తకాలు వెతుక్కుంటూ కనిపిస్తే.. 'ఎవరో పఠనాసక్తి మెండుగా గల మనిషి' అనీ అనుకుంటారు.

యూనివర్సిటీ టీచర్ల గదుల్లో కనిపిస్తుంటే.. 'వారి బంధుమిత్రులెవరో' అనుకుంటారు.

నిజానికి ఈయన ఎస్వీ యూనివర్సిటీలో తత్వశాస్త్రంలో పీజీ విద్యార్థి. పేరు రాజేంద్రబాబు. వాణిజ్య పన్నుల శాఖ అధికారిగా రిటైరయ్యాక పీజీలో చేరారు. కార్వేటినగరం మండలం కుమ్మరగుంటకు చెందిన రాజేంద్రబాబు ఎన్‌ఆర్ కండ్రిగలో ప్రాథమిక విద్య చదివారు. కత్తెరపల్లె, కార్వేటినగరంలలో హైస్కూలు చదువు సాగింది. టెన్త్‌లో స్కూల్ ఫస్ట్. తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్, ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. 1977లో ఎస్వీ యూనివర్సిటీలో ఎంఏ ఫిలాసఫీలో చేరారు కానీ చదువు సాగలేదు. ఇంటి దగ్గర వ్యవసాయ పనుల భారం పడింది. చదువు మధ్యలో వదిలేసి ఇంటి బాట పట్టారు. సేద్యం చేసుకుంటూనే పోటీ పరీక్షలు రాయడం మొదలు పెట్టారు. 1980లో రైల్వే సర్వీసు పరీక్షల్లో ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఏపీపీఎస్సీ పరీక్షల్లోనూ నెగ్గడంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిగా మారారు. వాణిజ్య పన్నుల శాఖలో చేరారు. ఉద్యోగం చేస్తూనే 1986లో దూరవిద్య ద్వారా బీఈడీ చేశారు. ఆగిపోయిన పీజీ చదువు పూర్తి చేయాలనే కోరిక ఉండిపోయింది. ప్రయివేటుగా చేసే అవకాశం ఉన్నా యూనివర్సిటీ కేంపస్‌లో చదవడం అనే ఫీలింగ్ రాదు. అది కలగానే ఉండిపోయింది. 2016లో అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా ఉద్యోగ విరమణ పొందిన రాజేంద్రబాబు.. తన కలకు రెక్కలు తొడిగారు. రామచంద్ర మిషన్ నిర్వహిస్తున్న హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రంలో చేరి తత్త్వశాస్త్ర గ్రంథాలను చదవడం మొదలు పెట్టారు. ఆ పుస్తకాలు చదువుతూ ఉంటే తాను వదిలిపెట్టిన ఎంఏ ఫిలాసఫీ కోర్సు పూర్తి చేయాలనిపించింది. పీజీలో రెగ్యులర్ విద్యార్థిగా చేరిపోయారు. క్రమశిక్షణగా తరగతులకు హాజరవుతారు. సందేహాలుంటే టీచర్లను అడుగుతారు. లైబ్రరీకి వెళ్లి పుస్తకాలు రెఫర్ చేస్తారు. రాజేంద్రబాబు తల్లి కృష్ణమ్మకి వందేళ్లు. పల్లెలోనే ఉంటుంది. భార్య సుమతి పోర్చుగల్‌లో ఛార్టెడ్ అకౌంటెంట్‌గా పని చేశారు. కుమార్తె చాందినికి వివాహం అయ్యింది. ఇంటి నుంచి ఐదు కిలోమీటర్ల దూరం. రోజూ సైకిలు మీదనే యూనివర్సిటీకి హాజరవుతారు. విశ్రాంత జీవితాన్ని అర్థవంతంగా మలచుకున్న రాజేంద్రబాబు వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమే అని నిరూపిస్తున్నారు. పీజీ పూర్తయ్యాక ధ్యానంపై విదేశీ విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ చేయాలన్నది ఈయన లక్ష్యం. అదీ సాధించగలననే ఆత్మవిశ్వాసంతో ఉన్నారు రాజేంద్రబాబు.

మా మంచి విద్యార్థి



క్రమం తప్పకుండా యూనివర్సిటీకి వస్తారు. అందరు విద్యార్థులతో కలిసిపోతారు. శ్రద్ధగా కొత్త కొత్త పుస్తకాలను చదువుతారు. సందేహాలను నివృత్తి చేసుకుంటూ ఉంటారు. ఫిలాసఫీపై రాజేంద్రబాబు పట్టు సాధించారు. ఆయనకున్న ఆసక్తి చూస్తే ఆశ్చర్యం, ఆనందం కలుగుతాయి.

- డాక్టర్ నాగలూరి దయాకర్, అధ్యాపకుడు, ఫిలాసఫీ విభాగం, ఎస్వీయూ



ఐస్..యాపిల్

- తాటిముంజలతో వేసవిలో ఉపశమనం
- అధికంగా తీసుకోవడం శ్రేయస్కరమంటున్న వైద్యులు



పీలేరు/పీలేరు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు ఎర్రటి ఎండలతో ఠారెత్తిస్తున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ, ఉక్కపోత, వడగాల్పులు, చెమట ధారలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. విభిన్న వాతావరణ పరిస్థితులు సృష్టించే ప్రకృతి, వాటిని ఎదుర్కొనే ఉపాయాలనూ బోధిస్తుంది. అలా ఎండల బారి నుంచి తప్పించుకోవడానికి ప్రకృతి తాటిముంజలను ప్రసాదించింది. కేవలం ఎండా కాలంలో మాత్రమే దొరికే ఇవి ఎండ వేడిమి నుంచి కాపాడడమే కాకుండా అనేక ఆరోగ్య గుణాలు కూడా కలిగి ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. చూడడానికి జెల్లీలా, నోటిలో వేసుకుంటే కరిగిపోయేలా ఉండే వీటి లోపలి భాగంలో నీరు ఉంటుంది. అందువల్ల శరీరానికి చలువ చేస్తుంది. అందుకే వాటిని 'ఐస్ యాపిల్' అని పిలుస్తారు. ఎండా కాలంలో తాటి ముంజలను అధికంగా తీసుకోవడం ద్వారా వడదెబ్బతో పాటు అనేక అనారోగ్య సమస్యల నుంచి తప్పించుకోవచ్చునని వారు తెలిపారు. గత మూడు రోజులుగా ఇవి పీలేరు ప్రాంతంలో పెద్దఎత్తున దొరుకుతున్నాయి.



పీలేరులో తాటిముంజలను విక్రయిస్తున్న వ్యాపారులు

అన్నమయ్య జిల్లా పీలేరు పరిసర ప్రాంతాల్లో తాటి చెట్లు లేకపోయినప్పటికీ చిత్తూరు జిల్లా ఐరాల, పూతలపట్టు మండలాల్లోని పలు ప్రాంతాల నుంచి పలువురు మహిళలు, వ్యాపారులు వాటిని పీలేరులో విక్రయిస్తున్నారు. డజన్ తాటి ముంజలు రూ.70 నుంచి రూ.100 చొప్పున అమ్ముతున్నామని వారు తెలిపారు.

అనేక ఆరోగ్య ప్రయోజనాలు...

- వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి తాటిముంజలు ఎంతగానో ఉపయోగపడతాయి. వాటిలో తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్ల వాటిని తింటే అధిక దాహార్తి తగ్గుతుంది. వడదెబ్బ నుంచి తప్పించుకోవచ్చు. శరీర ఉష్ణోగ్రతను అదుపులో పెడతాయి. శరీరం డీహైడ్రేట్ కాకుండా కాపాడుతాయి.
- వీటిలో ఎక్కువ తేమ, తక్కువ కొవ్వు ఉండడంతో అవి త్వరగా జీర్ణమై అసిడిటీ, పొట్ట ఉబ్బరం తగ్గి జీర్ణప్రక్రియను సజావుగా చేస్తాయి. చిన్నారులు, హృద్రోగులు, షుగర్ కలిగిన వారు, అధిక బరువుతో బాధపడే వారికి ఇవి ఎంతగానో మేలు చేస్తాయి.
- తాటిముంజలో ఎక్కువగా ఉండే పొటాషియం బీపీని కంట్రోల్ చేస్తుంది. తద్వారా గుండె జబ్బులను నివారిస్తుంది. అంతేకాకుండా శరీరంలోని హానికర వ్యర్థాలను బయటకు పంపడంతో పొటాషియం ఎంతగానో సహాయపడుతుంది.
- దొరికినంత కాలం తాటిముంజలను క్రమం తప్పకుండా తినడం వల్ల శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. తద్వారా లివర్ సమస్యలను అధిగమించవచ్చు.
- తాటి ముంజలు మహిళలకు ప్రకృతి ప్రసాదించిన వరం లాంటివి. వారిలో ఎక్కువగా కనిపించే రొమ్ము క్యాన్సర్ రాకుండా చూడడంతో తాటిముంజలు అద్భుతంగా పనిచేస్తాయని వైద్యులు చెబుతున్నారు. రొమ్ము క్యాన్సర్ కారక పెట్రో కెమికల్స్, ఆంథోసైనిన్ లాంటి వాటిని నిర్మూలిస్తాయని అనేక అధ్యయనాలు వెల్లడించాయి.
- ఎండ కారణంగా తరుచూ బయట తిరిగే వారిలో కనిపించే వికారం, వాంతులను ముంజలు నివారిస్తాయి. వేసవిలో వచ్చే చికెన్ పాక్స్(అమ్మవారు)ను కూడా నివారించవచ్చునని వైద్యులు చెబుతున్నారు.
- వేసవిలో ఎక్కువ సమయం ఆరుబయట ఆడుకునే చిన్నారుల్లో కనిపించే దద్దుర్లు వంటి చర్మ సమస్యలను సైతం తాటి ముంజలు తగ్గిస్తాయని వైద్య శాస్త్రం చెబుతోంది. దద్దుర్లపై తాటిముంజలతో మర్దన చేస్తే అవి మాయమైపోతాయి. వీటితో పాటు అధిక బరువు, గర్భిణీ, బాలింత మహిళలు, నెలసరి ఇబ్బందులు వంటి అనేక సమస్యలకు తాటిముంజలు బాగా పనిచేస్తాయని, వాటిని అధికంగా తీసుకోవాలని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు.

ప్రకృతి ప్రసాదించిన వేసవి వరం



వేసవి ఇబ్బందుల నుంచి తప్పించుకునేందుకు ప్రకృతి మనకు ప్రసాదించిన వరం తాటిముంజలు. ఎంఎన్‌సీలకు చెందిన కూల్‌డ్రింక్స్ తాగే బదులు సహజసిద్ధంగా వచ్చే తాటి ముంజలను తినడం ఎంతో మేలు. వాటిలో ఉండే ఔషధ గుణాలు తెలుసుకునే మన పూర్వీకులు వాటిని ఎక్కువగా తినమని సూచించారు. అయితే ఆధునికీకరణ పేరుతో మనలో చాలా మంది వాటి వైపు చూడడం లేదు. రోడ్డు పక్కన అతిచవకగా దొరికే ముంజలలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వాటిని చిన్నచూపు చూడకుండా అవి ఎంత కాలం దొరుకుతాయో అంతకాలం తింటే మంచిది. అప్పుడే మనం ఎండల నుంచి ఉపశమనం పొందగలం.

-డాక్టర్ పవన్‌కుమార్, చిన్నపిల్లల వైద్యుడు, పీలేరు

బాహుబలి యంత్రాలు

- 95 టన్నుల గడ్డర్లను అవలీలగా ఎత్తేసిన క్రేన్లు
- ఫ్లైఓవర్ నిర్మాణాల్లో కీలకంగా మారిన క్రేన్లు



పిల్లర్లపై గడ్డర్‌ను ఎత్తి పెడుతున్న క్రేన్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఐదు టన్నుల బరువుండే లాకర్లను ఏదైనా ఎత్తయిన భవనాల పైకి ఎత్తాలంటేనే క్రేన్ల సహాయంతో ఆపసోపాలు పడాల్సి ఉంటుంది. అలాంటిది 95 టన్నుల గడ్డర్లను 20 అడుగుల ఎత్తయిన పిల్లర్ల మీదికి చేర్చాలంటే ఇంకెంత పెద్ద క్రేన్లు అవసరమో తెలుస్తుంది. మదనపల్లె మండలం ఆరోగ్యవరం దిగువన నిర్మిస్తున్న ఫ్లైఓవర్ వద్ద అలాంటి బాహుబలి క్రేన్లు రెండు చూపరులను ఆశ్చర్యానికి గురిచేశాయి. మదనపల్లె-పీలేరు మధ్య నాలుగు లేన్ల జాతీయ రహదారి (ఎన్‌హెచ్-71) పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఎన్‌హెచ్-71 కింద తిరుపతి-మదనపల్లె ట్రంకు రోడ్డు క్రాసింగ్ అవుతోంది. ఈ ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి నాలుగు పిల్లర్లను కూడా సిద్ధం చేశారు. సుమారు నాలుగు నెలలుగా ఈ పిల్లర్ల సమీపంలోనే ఎనిమిది గడ్డర్లను కాంట్రాక్టు సంస్థ ఆర్‌సీసీ ద్వారా తయారు చేసింది. ఒక్కో గడ్డర్ సుమారు 95 టన్నుల దాకా బరువు ఉంటుంది. ఇలాంటి గడ్డర్లను ఎనిమిందిటిని పిల్లర్ల పైకి ఎత్తేంతుకు ప్రత్యేక క్రేన్లను తెప్పించారు.

బాహుబలి క్రేన్లు

ఎన్‌హెచ్-71 నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టు సంస్థ ప్రత్యేకంగా రూ.8 కోట్లు పెట్టి అత్యాధునికంగా పనిచేసే రెండు బాహుబలి క్రేన్లను కొనుగోలు చేశారు. ఈ క్రేన్లు అంతా ఎలక్ట్రానిక్ పద్ధతులతో, సెన్సార్లతో అతి బలమైన ఉక్కు తీగలు, క్రేన్లతో తయారు చేశారు. ఒక్కో క్రేన్ గరిష్ఠంగా ఎత్తే బరువు 48 టన్నులు కాగా, రెండు క్రేన్ల సహాయంతో ఒక్కో గడ్డర్‌ను ఎత్తి పిల్లర్లపై పెడుతున్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ ప్రక్రియలో ఎలాంటి చిన్న పొరపాటు, తప్పు జరిగినా కోట్ల విలువైన యంత్రాలు పాడవటంతో పాటు, విలువైన కార్మికుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో నిష్ణాతులైన ఇంజనీర్ల పర్యవేక్షణలో గడ్డర్లను భారీ ట్రాలీ లారీల్లో ఎక్కించి పక్కనే వున్న పిల్లర్ల వద్దకు ఇంచి, ఇంచి జరుపుకుంటూ వచ్చారు. ఒక గడ్డర్‌ను రెండు చివర్లా రెండు క్రేన్లు సమానంగా ఉక్కుతీగలతో కట్టి అర అడుగు చొప్పున, రెండు వైపులా ఒకే ఎత్తులో ఉండేలా పైకి ఎత్తారు. ఇలా 20 అడుగుల ఎత్తయిన పిల్లర్ల మీదకు ఒక్కో గడ్డర్‌ను ఎక్కించేందుకు రెండు గంటల సమయం పట్టింది. ఇలా ఎనిమిది గడ్డర్లను ఎత్తేందుకు ఇంజనీర్లు రెండు రోజుల సమయం తీసుకున్నారు.

ఫ్లైఓవర్ల నిర్మాణంలో కీలకం

మదనపల్లె నుంచి పీలేరు వరకు నిర్మిస్తున్న ఎన్‌హెచ్-71 నాలుగు లేన్ల రహదారి మార్గంలో పలుచోట్ల రోడ్ల క్రాసింగ్‌లు, చెరువు, నదులు ఉండటంతో ఈ ప్రాంతాల్లో ఫ్లైఓవర్లను డిజైన్ చేసి నిర్మించారు. 52 కిలోమీటర్ల పొడవునా జాతీయ రహదారిపై సుమారు 30 చోట్ల ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నారు. సిమెంటు గడ్డర్లతో పిల్లర్లపైన నిర్మించే బ్రిడ్జిలు (ఫ్లైఓవర్లు) ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో ఒక్కో గడ్డర్ ఎంత లేదన్నా 95 టన్నుల బరువు ఉంటుంది. వీటిని ఎత్తి పిల్లర్లపైకి పెట్టేందుకు నిర్మాణ సంస్థ రూ.8 కోట్లతో రెండు బాహుబలి క్రేన్లను తెప్పించడంతో ఇవే కీలకపాత్ర పోషిస్తున్నాయి. దీంతో నిర్మాణంలో ఫ్లైఓవర్లను చాకచక్యంగా, అవలీలగా పూర్తి చేస్తున్నారు.



గడ్డర్లను ఫ్లైఓవర్ సమీపంలోకి తీసుకొస్తున్న ప్రత్యేక ట్రాలీ లారీ



పిల్లర్లపైకి వరుసగా ఎత్తి పెట్టిన అతి బరువైన గడ్డర్లు